క్లుప్తంగా

నేడు కె.నాగలాపురంలో ముగ్గుల పోటీలు

గూడూరు రూరల్: కె.నాగలాపురంలోని కర్రెమ్మ గుడి వద్ద సోమవారం మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించనున్నట్లు ఆదివారం గ్రామ పెద్దలు గోపాల్‌రెడ్డి, సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని గత రెండేళ్ళుగా ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామన్నారు.

నీటి చౌర్యాన్ని అరికట్టండి

కోడుమూరు రూరల్ : కోడుమూరులో నెలకొన్న నీటి సమస్య పరిష్కారానికి గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి హంద్రీనదిలోకి విడుదల చేసిన నీటిని కొందరు రైతులు ఇంజన్లు వేసి మళ్లీస్తున్నారని, వెంటనే నీటి చౌర్యాన్ని అరికట్టాలని కోడుమూరు పంచాయతీ ఈఓ అజయ్ భాస్కర్ ఆదివారం ఇరిగేషన్ అధికారులను కోరారు. రైతులు ఇంజిన్లు వేసి పొలాలకు నీటిని మళ్లీస్తుండడంతో హంద్రీలోకి నీటి చేరిక బాగా తగ్గిపోయిందన్నారు. ప్రజల మంచినీటి అవసరాలను తీర్చేందుకు విడుదల చేసిన నీటిని వ్యవసాయానికి మళ్లించకుండా అధికారులు గస్తీ ఏర్పాటు చేయాలని ఈఓ కోరారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు


చిత్తూరు- తిరుపతి టీమ్‌లు తలపడుతున్న దృశ్యం

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న కబడ్డీ పోటీలు రెండవ రోజు ఆదివారం హోరాహోరీగా సాగాయి. పాణ్యం వ్యాయామ ఉపాధ్యాయులు ఉత్తమ ప్రతిభ క్రీడాకారులు, క్రీడాకారిణుల జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న పోటీల్లో క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. జాతీయ స్థాయి మహిళల, ఉమ్మడి జిల్లా పురుషుల కబడ్డీ పోటీలు సాగాయి. పోటీలను తిలకించేందుకు క్రీడాభిమానులు భారీగా మైదానానికి చేరుకున్నారు.

దొరికిన పర్సు అందజేత


గడివేముల: మండల పరిధిలోని గని గ్రామం నుంచి జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీకి బైకుపై వస్తున్న విద్యుత్ కార్మికుడు పెద్దన్నకు తలముడిపి బాట వద్ద ఆదివారం పర్సు దొరికింది. జిందాల్ ఫ్యాక్టరీకి వెళ్లిన అనంతరం పర్సులో ఉన్న రూ.వెయ్యితో పాటు విలువైన ఐడెంటిటీ కార్డులు ఉన్నాయి. పర్సులో ఉన్న నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. దీంతో బండిఆత్మకూరు మండల ఈర్నపాడుకు చెందిన లోకనాథరెడ్డి రావడంతో పర్సును అందజేశాడు. కార్మికుడు పెద్దన్నను పలువురు అభినందించారు.

ఘనంగా శోభన్ బాబు జయంతి వేడుకలు


శోభన్‌బాబు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ తదితరులు

కర్నూలు (టౌన్) : నగరంలోని స్థానిక గాంధీ నగర్ వద్ద ఆదివారం సినీనటుడు శోభన్ బాబు 88 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శోభన్ బాబు సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ శోభన్ బాబు విగ్రహానికి పూలమాల వేసి భారీ కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నటుడు శోభన్ బాబు చేసిన అనేక సినిమాలు మనకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, దొరబాబు, రైల్వే ప్రసాద్, యోహాన్, శ్రీను, చిన్నరాముడు, శోభన్ బాబు సేవా సమితి అభిమానులు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


మృతిచెందిన ఈడిగ చిరంజీవి

దేవనకొండ: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందడంతో పండగ పూట ఆ ఇంట విషాదం నెలకొంది. బంటుపల్లి గ్రామానికి చెందిన ఈడిగ చిరంజీవి(24) డిగ్రీ పూర్తి చేసి హైదరాబాద్‌లోని ఓ ప్రయివేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. సంక్రాంతి పండగను తన కుటుంబ సభ్యులతో జరుపుకోవాలని హైదరాబాద్ నుంచి బైకుపై తన స్నేహితుడు బాలకృష్ణతో కలిసి బయలుదేరాడు. ఈదుల దేవరబండ సమీపంలోని వీరంపల్లి స్టేజి వద్ద ఎదురుగా వస్తున్న కారును ఢీకొని చిరంజీవి అక్కడికక్కడే మృతిచెందారు. వెనకాల ఉన్న బాలకృష్ణ తీవ్ర గాయాలు కావడంతో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. చిరంజీవి ఒక్కడే కుమారుడు కావడంతో ఆ ఇంటిలో పండగ పూట విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


ముగ్గులు వేస్తున్న మహిళలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం


గని గ్రామంలో భోగిమంటలు వేస్తున్న గ్రామస్తులు


ముగ్గులను వేస్తున్న ఆడపడుచులు

అంబరాన్నంటిన భోగి సంబరాలు

- ముగ్గులతో కళకళలాడిన పల్లెలు
- కనుల పండువగా సాగిన వేడుకలు

పాణ్యం: సంక్రాంతి వేడుకల్లో భాగంగా ఆదివారం భోగి సంబరాలు అంబరాన్నంటాయి. తెల్లవారు జాము నుంచే ఇళ్ల ఎదుట అందమైన ముగ్గులు వేశారు.రంగవల్లులను తీర్చి దిద్ది గొబ్బెమ్మలను పెట్టి సంక్రాంతి లక్ష్మికి స్వాగతం పలికారు. గ్రామాల్లో గోమాత పూజ, గంగిరెద్దుల విన్యాసాలు, భోగి మంటలు విశేషంగా అలరించాయి. కాలనీలు ముగ్గులతో కళకళలాడాయి. ఆడపడుచులు, బంధువులతో రాకతో గ్రామాల్లో సందడి నెలకొంది. అదేవిధంగా ప్రాంతాల్లో నిర్వహించిన ముగ్గుల పోటీలు ఉత్సాహంగా సాగాయి. మహిళలు పోటీపడుతూ వివిధ రకాల ముగ్గులు వేశారు. నిర్వాహకులు విజేతలకు బహుమతులను అందజేశారు.

కల్లూరు: మండలంలో భోగి సంబరాలు ఘనంగా జరిగాయి. కల్లూరు అర్బన్, గ్రామీణ ప్రాంత్రాల్లో వేడుకలు మిన్నంటాయి. వేకువజాము నుంచి మహిళలు ఇళ్ల ఎదుట అందమైన ముగ్గులు వేశారు.

కల్లూరు: సంక్రాంతి పండగ పురస్కరించుకుని భోగి రోజు ఆదివారం కల్లూరు ఊరువాకిల దగ్గర శ్రీ లక్ష్మి చేన్నకేవవ స్వామి దేవాలయంలో వీరశైవ లింగాయత్ సమితి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు వీరశైవ లింగాయత్ సంఘం అధ్యక్షుడు చంద్రశేరప్ప, దాత బాలరాజు కుటుంబ సభ్యులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వీరన్న, మల్లయ్య , వీరేంద్ర, పెద్ద లక్ష్మయ్య, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

గడివేముల: ఊరూరా సంక్రాంతి సందడులు మొదలయ్యాయి. ఆదివారం భోగి వేడుకలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజామునే ప్రజలు భోగి మంటలు వేసుకుని ఆనందంగా గడిపారు. ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు, గోబ్బెమ్మలతో అలంకరించారు. ప్రతి ఇల్లూ బంధువులు, స్నేహితులతో సందడిగా మారింది. భోగి మంటల వద్ద చిన్న, పెద్ద తేడా లేకుండా డాన్సులు వేశారు. రేగుపండ్లను భోగి మంటలో వేయడం వలన చిన్నపిల్లలకు పీడలు తొలగిపోయి ఆయుఆరోగ్యాలు చేకూరుతాయని నమ్మకంతో పిల్లలు,పెద్దలు మంటల్లో వేశారు.ఆలయాలకు వెళ్లి ప్రత్యేకపూజలు నిర్వహించారు. సాంప్రదాయలు మరవకుండా ఇప్పటికీ గంగిరెద్దుల వారు గ్రామాల్లో ప్రతి ఇళ్లుతిరిగారు.


గూడూరులో ముగ్గువేస్తున్న దృశ్యం

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌తోపాటు గ్రామాల్లో భోగి వేడుకలు ఘనంగా సాగాయి. ఆదివారం వేకువజామునకే ఆవరణాలలో కళ్లాపిచల్లి, రంగురంగుల ముగ్గులను అందంగా వేశారు. సి.బెళగల్‌లోని, కొమటి, బోయ, తెలుగు వీధులతో పాటు గ్రామంలోకి వెళ్ల ప్రధాన రహదారి, ఎమ్మిగనూర్ - గూడూరు మెయిన్ రోడ్డులో అంగళ్ల ఎదుట ముగ్గులు ఆకట్టుకున్నాయి. సి.బెళగల్లో హరిదాసులు పర్యటించి సందడి చేశారు.


సి.బెళగల్లో హరిదాసులకు ధాన్యం దానం చేస్తున్న మహిళ

గూడూరు: సంక్రాంతి సంబరాలలో భాగంగా పట్టణంలో ఆదివారం భోగి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఇంటి ఎదుటా తెల్లారెసరికి అందమైన రంగ వల్లులు దర్శనం ఇచ్చాయి. ప్రతి వీధి లోనూ భోగి సంబరాలు కనిపించాయి.

కోడుమూరు రూరల్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం మండల ప్రజలు ఘనంగా భోగి సంబరాలు చేసుకున్నారు. భోగి సందర్భంగా తెలవారకముందే ఆయా ఇళ్ల ఎదుట మహిళలు అందమైన రంగవల్లులు వేసి, వాటిల్లో గొబ్బెమ్మలు ఉంచి పూజలు నిర్వహించారు. పండుగకు కొన్ని రోజుల ముందే రబీ దిగుబడులు ఇళ్లకు చేరడంతో ఆయా పల్లెల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి.


కోడుమూరులో రంగురంగుల ముగ్గును వేస్తున్న మహిళలు

గూడూరు: సంక్రాంతి పండుగ సందర్భంగా మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని లింగమయ్య కట్ట మైదానంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. విజేతలకు అధికారులు బహుమతులు అందించారు. మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్, వైఎస్సార్సీపీ నాయకులు జే.ఆబేల్, ఎల్.వెంకటేశ్వర్లు, మెస్మా సీఎంఓ సూర్యనారాయణ, ఆర్పీలు పాల్గొన్నారు.

అట్టహాసంగా క్రికెట్ పోటీలు ప్రారంభం

గూడూరు రూరల్: కె.నాగలాపురంలో సంక్రాంతి పండగ సందర్భంగా ఆదివారం జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఎస్ఐ సోమ్లానాయక్, సర్పంచ్ నయోమి, సాగునీటి కమిటీ మాజీ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సోమ్లానాయక్ మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని, గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. సర్పంచ్ నయోమి మాట్లాడుతూ విజేతలకు మొదటి బహుమతిగా రూ. 20 వేలు, రెండవ బహుమతిగా రూ. 10 వేలు గ్రామ పెద్దల ద్వారా అందించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మీనా, గ్రామ పెద్దలు సురేష్, డీలర్ మద్దిలేటి, నాగ సుంకన్న, తిరుపాలు, సుంకన్న, నాగులు, వార్డు మెంబర్లు లోకరాజు, అశోక్, పెంచికలపాడు క్రిష్ణ, అనీఫ్, తదితరులు పాల్గొన్నారు.


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ నయోమి, ఎస్ఐ సోమ్లానాయక్

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ఓర్వకల్లు: మండలంలోని కొమరోలు గ్రామంలో పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన గిరిగారి శేషిరెడ్డి కొడుకు శ్రీనివాసరెడ్డి(53) పొలాలను కౌలుకు తీసుకొని జీవనం సాగించేవాడు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది 8 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని వివిధ రకాల పంటలను సాగు చేశాడు. వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు సరిగా పండలేదని తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. పంట పెట్టుబడులు, కుటుంబ పోషణకు దాదాపు రూ.9 లక్షలు అప్పుచేశాడు. అప్పులు తీర్చలేక మనస్థాపంతో శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా కోలుకోలేక ఆదివారం సాయంత్రం మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు ఆసుపత్రికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుని భార్య ఇందిరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

అనాథలకు దుప్పట్ల పంపిణీ


అభాగ్యులకు అన్నదానం చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

కర్నూలు కల్చరల్: అవధూత దత్త పీఠాధిపతులు, ఉత్తరాధికారి శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామిజీ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సూర్యనారాయణ స్వామి ఆలయంలోని దేవతా పరివారానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకటరమణ కాలనీలోని మున్సిపల్ కార్పొరేషన్ అనాథ శరణాలయం, నరసింహారెడ్డి నగర్, పంపాస్‌లోని నిరుపేదలకు అన్నదానం నిర్వహించారు. అభాగ్యులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ ట్రస్ట్ టి. శివరామకృష్ణ, సభ్యులు డాక్టర్ ఆంజనేయులు, డాక్టర్ కృష్ణమోహన్, ప్రకాష్, కృష్ణమూర్తి, శ్రీదేవి, నాగజ్యోతి సుదర్శన జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

భూ యాజమాన్య హక్కుల చట్టాన్ని రద్దు చేయాలి

కర్నూలు(సెంట్రల్): భూ యాజమాన్య హక్కు ల చట్టాన్ని రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కలెక్టరేట్ ఎదుట భూ యాజమన్యా హక్కుల చట్టం ప్రతులను సీపీఎం, సీపీఐ, ఇతర రైతుసంఘాల నాయకులు వేర్వేరుగా భోగి మంటల్లో దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ చట్టం తయారు చేసినా న్యాయ సమీక్షకు అవకాశం ఉండాలన్నారు.జి.రామకృష్ణ, పుల్లారెడ్డి, పి.రామకృష్ణారెడ్డి, కె.జగన్నాథం, బొల్లవరం వెంకటేశ్వర్లు, విజయకుమార్ పాల్గొన్నారు.

సంప్రదాయాలకు ప్రతీక రంగవల్లులు

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక ముగ్గులు అని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సంక్రాతి పండుగ సందర్భంగా ఆదివారం సాయంత్రం 34వ వార్డులోని నిర్మల్‌నగర్, వాసవీనగర్‌లో స్థానిక కార్పొరేటర్ ఎరుకల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. దాదాపు 300 మంది మహిళలు పోటీల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే కాటసాని, కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి, పొదుపు సంఘాల మహిళలు హాజరై ముగ్గులను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే సంక్రాతి శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. వీధుల్లో ముగ్గులను చూస్తుంటే అచ్చం పల్లెటూరు వాతావరణం కనిపిస్తుందని చెప్పారు. ఈ ఏడాది ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఇప్పటికే సీఎం వైఎస్ జగన్ ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పాలన అందిస్తున్నారన్నారు. మహిళల అభ్యున్నతి కోసం వైఎస్సార్ చేయూత, పొదుపు సంఘాలలకు సున్నావడ్డీ, వైఎస్సార్ ఆసరా వంటి పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి ఆయనను ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి డబుల్ డోర్ ఫ్రిజ్‌ను జమున , రెండో బహుమతి వాషింగ్ మెషిన్‌ను ఇంద్రజ , మూడవ బహుమతి టీవీని పూజిత, నాల్గవ బహుమతి కూలర్‌ను జ్యోతి , ఐదవ బహుమతి మిక్సిని వీనాబాయి గెలుచుకున్నారు. వారికి ఎమ్మెల్యే ఆయా బహుమతులు అందజేశారు. అలాగే పోటీల్లో పాల్గొన్న వారందరికీ పోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నారాయణరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు కృష్ణమూర్తి, నాయకులు రామాంజనేయులు, సుధాకర్‌రెడ్డి, పొదుపు సంఘాల ఆర్పీలు జానకమ్మ, మాధురి, వార్డులోని స్థానిక నాయకులు పాల్గొన్నారు.


ముగ్గులను పరిశీలిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

క్రీడలతో పేరు ప్రఖ్యాతులు

- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు రూరల్ : క్రీడల్లో రాణించడం ద్వారా గ్రామీణ క్రీడాకారులు మంచి పేరు తెచ్చుకోవాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీల విజేతలకు ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ చేతుల మీదుగా నిర్వాహకులు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లోని నైపుణ్యాలను వెలికితీసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలను నిర్వహిస్తున్నారన్నారు. ఈ ఆటల పోటీల ద్వారా గ్రామీణ క్రీడాకారులకు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో గెలుపొందిన గోరంట్ల జట్టుకు రూ.30వేలు, రెండవ స్థానంలో నిలిచిన ప్యాలకుర్తి జట్టుకు రూ.15వేల చొప్పున ఎమ్మెల్యే డా.సుధాకర్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ యాదవ్‌లు అందజేశారు.


గోరంట్ల క్రికెట్ జట్టుకు నగదు బహుమతిని అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

రాష్ట్రస్థాయి బండలాగుడు విజేత పంచలింగాల

గడివేముల: మండల పరిధిలోని అళ్లగడ్డ గ్రామంలో సంక్రాంతి, మౌలాలి స్వామి తిరునాల సందర్భంగా ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగు పోటీలు పోటీలు హోరాహోరీగా సాగాయి. గ్రామ రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో కర్నూలు జిల్లా పంచలింగాల గ్రామానికి చెందిన సుంకన్న బ్రదర్స్ ఎద్దులు సత్తాచాటాయి. మొదటి స్థానంలో నిలిచి మొదటి బహుమతి రూ.40 వేలు కై వసం చేసుకున్నాయి. రెండవ బహుమతి రూ.30 వేలను వైఎస్సార్ జిల్లా దాసరి పల్లి గ్రామానికి చెందిన చిన్న వీరన్న వృషభాలు, మూడవ బహుమతి రూ.20 వేలను నారాయణపేట మక్తల్ గ్రామానికి చెందిన ఏఆర్‌ఎం బుల్స్, నాల్గవ బహుమతిని నంద్యాల జిల్లా సోమయాజులపల్లె గ్రామానికి చెందిన యాగల నరసయ్యయాదవ్ వృషభాలు కై వసం చేసుకున్నాయి. కార్యక్రమంలో పీపీ రమణారెడ్డి, లోకేశ్వరెడ్డి, వెంకటరెడ్డి, లక్ష్మిరెడ్డి, శివశంకర్‌రెడ్డి, వెంకటరమణ, ఆదినారాయణ, సర్వేశ్‌రెడ్డి, సురేంద్ర, నాగార్జునరెడ్డి,సుదర్శన్‌రెడ్డి,బట్టల జమాల్,వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.


విజేత వృషభాల యాజమానికి నగదు అందజేసు దృశ్యం

వ్యక్తిపై దాడి..బంగారు గొలుసు అపహరణ

- పోలీసుల అదుపులో ఇద్దరు, పరారీలో మరో నలుగురు నిందితులు

ఓర్వకల్లు: చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఓ గిరిజన వ్యక్తిపై కొందరు సామూహిక దాడికి పాల్పడ్డారు. అతని మెడలోని బంగారం గొలుసను అపహరించుక పోయిన సంఘటన గుమ్మితం తండా వద్ద గల మెగా సోలారు పరిశ్రమలో శనివారం రాత్రి చోటుచేసుకొంది. బాధితుడు, పోలీసుల వివరాల మేరకు.. గుమ్మితం తండా వద్ద జరుగుతున్న సోలార్ నిర్మాణ పరిశ్రమలోని జియో టవర్ ఎదురుగా తండాకు చెందిన పుల్లన్న నాయక్ చిల్లర కొట్టు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. అదే క్యాంపులో పని చేస్తున్న పంజాబ్ రాష్ట్రానికి చెందిన ఆరుగురు వలస కార్మికులు శనివారం రాత్రి తాగిన మైకంలో పుల్లన్న నాయక్‌పై మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. కొట్టులో సరుకులతో పాటు, పుల్లన్న నాయక్ మెడలోని రెండు తులాల బంగారు గొలుసును బలవంతంగా తీసుకెళ్లారు. స్థానికులు గ్రీన్‌కో క్యాంప్ పోలీసులకు తెలిపారు. స్థానికుల సాయంతో గాలింపు చేపట్టిన క్యాంప్ పోలీసులు ఇద్దరిని గుర్తించి పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. దాడికి పాల్పడిన మరో నలుగురు నింధితుల కోసం గాలింపు చర్యలు చేపట్టామని ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు. వారి ఆచూకి తెలిశాక బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతామని ఎస్ఐ పేర్కొన్నారు. పుల్లన్న నాయక్ ఓర్వకల్లు సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు.

రైతుల మోములో ఆనందం

- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

గడివేముల: వైఎస్సార్‌సీపీ పాలనలో రైతుల ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తోందని వైఎస్సార్ సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అళ్లగడ్డ గ్రామంలో సంక్రాంతి, మౌలాలి స్వామి ఉరుసు సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగు పోటీలను ఎమ్మెల్యే కాటసాని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో పండుగల రోజు రైతు సంబరాలు నిర్వహించడంతో ఎంతో శుభపరిణామమన్నారు. ప్రతి ఏడాది గ్రామంలో ఎద్దుల పోటీలు నిర్వహించాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రైతులకు అన్నివిధాలుగా అండగా నిలుస్తున్నారని, వర్షాలు సైతం సకాలంలో కురవడంతో గ్రామాలు కళకళలాడుతున్నాయన్నారు. రెండు సీజన్‌లకు పుష్కలంగా సాగునీరు అందిస్తున్నట్లు చెప్పారు. కేసీ కెనాల్ ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామన్నారు. రైతులకు కావాల్సిన అన్ని సదుపాయాల ఆర్బీకేల ద్వారా అందిస్తున్న ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. టీడీపీ ప్రభుత్వ హాయంలో అంతా కరువుమయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయాన్ని పండులగా మార్చిందన్నారు. అనంతరం కొంతసేపు రైతులతో ముచ్చటించారు. తదనంతరం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని గ్రామస్తులు, పెద్దలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివరామిరెడ్డి, జిల్లా సెక్రటరీ రఘుమాధవరెడ్డి, కార్యవర్గ సభ్యుడు నంద్యాల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ మహేశ్వరరెడ్డి, ఉప సర్పంచ్ బాలచెన్ని, నాయకులు రమణారెడ్డి, శివానందరెడ్డి,దేశం నాగేశ్వరరెడ్డి, ఎల్లారెడ్డి, సర్వేశ్‌రెడ్డి, అనిల్‌కుమార్ రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, రమేష్, చంద్రమౌళీశ్వర రెడ్డి, పుల్లయ్య, సీపీ రమణయ్య, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అళ్లగడ్డ గ్రామంలో రాష్ట్రస్థాయి బండలాగు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

స్వచ్ఛ స్ఫూర్తికి నిదర్శనం ప్రధాని మోదీ

కర్నూలు కల్చరల్: స్వచ్ఛ స్ఫూర్తికి నిదర్శనం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అని బీజేపీ రాష్ట్ర నాయకులు నగరూరు రాఘవేంద్ర అన్నారు. ఆదివారం అశోక్‌నగర్‌లోని ప్రసన్నాంజనేయ ద్వారా సా యి ఆలయంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ భారత్‌ను ఆవిష్కరించేందుకు అందరూ సన్నద్ధం కావాలన్నారు. స్వచ్ఛభారత్ ద్వారా దేవాలయాలను శుభ్రం చేసే కార్యక్రమం మొదలు పెట్టామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లోకేశ్వరయ్య, కోటి యాదవ్, రామచంద్రారెడ్డి, శివ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

కర్నూలు(సెంట్రల్): అంగన్‌వాడీల సమ్మె కొనసాగుతోంది. 34వ రోజు ఆదివారం శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో అంగన్‌వాడీలు నోటికి నల్లబట్ట కట్టుకొని నిరసన తెలిపారు. ప్రభుత్వం అంగన్‌వాడీల డిమాండ్లపై స్పందించాల ని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ అన్నారు.కార్యక్రమంలో నాయకులు సీహెచ్ సాయిబాబా, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యంలో అష్టావధానం ప్రత్యేకం

కర్నూలు కల్చరల్: తెలుగు సాహిత్యంలో అష్టావధాన ప్రక్రియ ప్రత్యేకమైందని, రాయలసీమ అవధానులకు పుట్టినిల్లు అని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో సీక్యాంప్‌లోని కళాక్షేత్రంలో అష్టావధాన కార్యక్రమం జరిగింది. తిరుపతికి చెందిన శతావధాని ఆముదాల మురళి అవధానం నిర్వహించారు. పృచ్ఛకులుగా అవధానం సుధాకరశర్మ, కర్నాటి చంద్రమౌళిని, దండెబోయిన పార్వతి, మధుసూదన శర్మ, తొగట సురేష్‌బాబు, మహమ్మద్ మియ్యా, సునీత, ఇనాయతుల్లా వ్యవహరించారు. ఈ సందర్భంగా పత్తి ఓబులయ్య మాట్లాడుతూ ఈ సంవత్సరం కళాక్షేత్రంలో ప్రతి నెల సంగీత, సాహిత్య కార్యక్రమాలు, నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తామన్నారు. ఆంధ్రులకు సంక్రాంతి పర్వదినం ఎంతో ప్రత్యేకమైందన్నారు.

ముగిసిన కబడ్డీ పోటీలు

- పురుమల విభాంగలో గోనెగండ్ల ప్రథమ స్థానం
- సత్తా చాటిన గుజరాత్ మహిళా జట్టు

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా నుంచి జరుగుతున్న కబడ్డీ పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. ఉమ్మడి జిల్లా పురుషుల విభాగంలో మొదటి స్థానంలో గొనెగండ్ల జట్టు రూ. 40వేలు కైవసం చేసుకుంది. అదేవిధంగా జాతీయ స్థాయి మహిళా విభాగంలో గుజరాత్ టీమ్ సత్తా చాటి రూ. 35వేలు సొంతం చేసుకుంది. అలాగే ద్వితీయ బహుమతి పురుషుల విభాగంలో నంద్యాల జిల్లా బండిఆత్మకూరు టీమ్ రూ.30వేలు, మహిళా విభాగంలో తమిళనాడు జట్టు రూ.20వేలు గెలుచుకున్నాయి. పాణ్యం జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి విజేత జట్లకు నగదు ప్రోత్సాహ బహుమతులను అందించారు. కార్యక్రమంలో నిర్వహకులు, దాతలు, క్రీడాకారులు , ప్రజా ప్రతినిధులు, వ్యాయమ ఉపాధ్యాయులు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.


ప్రథమ స్థానంలో నిలిచిన గోనెగండ్ల కబడ్డీ జట్టు